నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, బుధవారం 10 జనవరి 2024 | HYDERABAD

కేఐఐటీ విద్యార్థికి రూ.63 లక్షల ప్యాకేజీ

సిటీబ్యూరో, జనవరి 9(నమస్తే తెలంగాణ): భువనేశ్వర్‌లోని కేఐఐటీ యూనివర్సిటీ విద్యార్థికి రూ.63 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం పొందారని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 750 కంపెనీలు పాల్గొని 6,200 ఉద్యోగావకాశాలకు ఆఫర్ ఇవ్వగా, అందులో 5000 మంది విద్యార్థులు ఉద్యోగార్హత సాధించారు. 2023లో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో కనిష్ట వార్షిక వేతనం రూ.8.2 లక్షల నుంచి ప్రారంభం కాగా, అత్యధికంగా రూ.63 లక్షల వార్షిక వేతనంతో యూనివర్సిటీ విద్యార్థి యుగాబైట్‌లో ఉద్యోగం పొందారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో అమెజాన్, అల్టాసియన్, లైట్ బీమ్ వంటి కంపెనీలు రూ.30 లక్షల వార్షిక వేతనంలో ఉద్యోగావకాశాన్ని కల్పించాయని తెలిపారు. కేఐఐటీ వర్సిటీని 1997 నుంచి ప్రముఖ విద్యావేత్త, ప్రొఫెసర్ అచ్యుత సమంతా ఉన్నత విద్యా ప్రమాణాలతో నిర్వహిస్తున్నారని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఎన్ఐఆర్ఎఫ్ ఇండియా ర్యాంకింగ్‌లో 16వ స్థానం దేశ స్థాయిలో వచ్చిందని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ కేఐఐటీ వర్సిటీకి మంచి గుర్తింపు ఉందన్నారు.

లంచ్ విత్ ఎమ్మెల్యే

నాచారం వెస్లీ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి - ఉప్పల్, జనవరి 9

ఫైర్ సేఫ్టీపై ఈవీడీఎం మాక్ డ్రిల్

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : అగ్ని ప్రమాదాలపై చిన్నారులకు అవగాహన కల్పిస్తే వారి జీవితకాలం భద్రతా నైపుణ్యాలు అలవర్చుకుంటారని ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఈవీడీఎం ఆధ్వర్యంలో టోలిచౌకిలో పోడియం మాల్, సంతోష్‌నగర్ సాయి డిగ్రీ కాలేజీ, సరూర్‌నగర్ త్రివేణి స్కూల్, కూకట్‌పల్లి పై ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్, బేగంపేట ఐడీఎఫ్‌సీ బ్యాంక్ బిల్డింగ్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఆరు జోన్ల పరిధిలో వారానికొకసారి ఒక్కో జోన్‌లో మాక్ డ్రిల్ చేపడుతున్నామన్నారు. ఆయా వాణిజ్య భవనాలు, ఆసుపత్రులు, పాఠశాలలో మాక్ డ్రిల్ అవసరం అనుకుంటే 040-2955 5500, మొబైల్ నంబరు 9000113667లకు ఫోన్ చేయొచ్చని ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి సూచించారు.

రోగి కడుపులో గోర్లు, మేకులు

సుల్తాన్‌బజార్, జనవరి 9 : చంచల్‌గూడ జైలులో ఖైదీగా ఉన్న 21 ఏండ్ల మహమ్మద్ సొహైల్ కడుపులో ఉన్న 8 రకాల మెటల్స్‌ను ఉస్మానియా దవాఖాన వైద్యులు విజయవంతంగా తొలగించి ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళితే.. జైలులో ఉన్న సొహైల్ గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతూ ఉండటంతో జైలు అధికారులు ఉస్మానియా దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. జనరల్ సర్జరీ విభాగం యూనిట్-7 ప్రొఫెసర్ డాక్టర్ బొంగు రమేశ్ రోగిని పర్యవేక్షించి మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి రిఫర్ చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ బి.రమేశ్ కుమార్ రోగికి ఎక్స్‌రే తీయించగా కడుపులో మేకులు, గోర్లు, ప్లాస్టిక్ వస్తువులు, మెటల్ ఉన్నట్లు గుర్తించారు. సుమారు గంట పాటు శ్రమించి ఎండోస్కోపి సహాయంతో వాటిని తొలగించారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకొని ఆరోగ్యం ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి భగవద్గీతను అందిస్తున్న అక్షయ పాత్ర ఫౌండేషన్ రీజినల్ ప్రెసిడెంట్, హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ సత్యగౌర చంద్ర దాస ప్రభుజీ

- సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ)



తుర్కయంజాల్‌లోని సెయింట్ పాల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ ఎంట్రీ చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు

ప్రజాపాలన ప్రైవేటు ఎంట్రీ

పది రూపాయలకు ఒక్క దరఖాస్తు

ఒక్క రోజు 80 ఎంట్రీలు చేస్తే రూ.800

జీహెచ్‌ఎంసీలో సిబ్బంది కరువు
విద్యార్థులు, ప్రైవేట్ ఆపరేటర్లతో సేవలు
రెండు షిఫ్టుల్లో దరఖాస్తుల కంప్యూటరీకరణ

వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం?
రోడ్డెక్కిన ప్రజాపాలనపై నెటిజన్ల ఫైర్
సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్

ఖైరతాబాద్, జనవరి 9 : ప్రజాపాలన దరఖాస్తులన్నీ ప్రైవేటు వ్యక్తులతో డేటా ఎంట్రీ జరుగుతోంది. దరఖాస్తులు లక్షల్లో ఉండడంతో వాటిని త్వరితగతిన ఎంట్రీ చేసేందుకు జీహెచ్‌ఎంసీలో సిబ్బంది కరువయ్యారు. దీంతో పలువురు ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు, ప్రైవేట్ ఆపరేటర్లను బల్దియా హైర్ చేసుకున్నది. డేటా ఎంట్రీకి జోనల్ కార్యాలయాల్లో సరిపోను స్థలం లేకపోవడంతో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలపై ఆధారపడ్డారు. ఖైరతాబాద్ సర్కిల్‌కు సంబంధించి జోనల్ కార్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు వాసవీ కేంద్రంలో ఏర్పాటు చేశారు. అలాగే జూబ్లీహిల్స్‌కు సంబంధించి రాజ్‌భవన్ హైస్కూల్, సరస్వతీ విద్యామందిర్, భారతీయ విద్యాభవన్‌లో ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి 12 గంటల వరకు రెండు షిఫ్టులలో డేటా ఎంట్రీ చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్కరు 80 ఎంట్రీలను తప్పుల్లేకుండా చేస్తే వారికి రూ.800 చెల్లిస్తామని అధికారులు తెలిపారు.

తప్పుల్లేకుండా చేయాలి

- కమిషనర్ రోనాల్డ్‌రోస్

ప్రజా పాలన దరఖాస్తుల డేటా ఎంట్రీని తప్పులు లేకుండా చూడాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జీహెచ్ ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఖైరతాబాద్ జోన్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. ఒక్కొక్క దరఖాస్తు ఎంత సమయం పడుతుందని ఆపరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఐటీ స్నేహ శబరీష్, జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రె తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ జోనల్ కార్యాయంలో డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న కమిషనర్ రొనాల్డ్ రాస్, జడ్పీ వెంకటేశ్ దోత్రే తదితరులు

ప్రజాపాలనపై నెటిజన్ల ఫైర్

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ): రోడ్డెక్కిన ప్రజాపాలన పేరుతో నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన కథనం జీహెచ్ఎంసీ వ్యాప్తంగా సంచలనం కలిగించింది. బాలానగర్ ఫ్లైఓవర్‌పై అంగడి సరుకులా తరలిస్తున్న దరఖాస్తుల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఘటనపై నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. ప్రజా పాలన దరఖాస్తుల తీరు, విధివిధానాలను తప్పుపడుతూనే డేటా చౌర్యానికి ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు.

కుత్బుల్లాపూర్‌లో ప్రజాపాలన దరఖాస్తులను ఇంటికి తీసుకెళ్తున్న ప్రైవేట్ వ్యక్తి

దరఖాస్తులన్నీ ఇంటికే!

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఓ ప్రైవేట్ వ్యక్తి సుమారు రెండు వందలకు పైగా ప్రజాపాలన దరఖాస్తులను డేటా ఎంట్రీ చేసేందుకు ఇంటికి తీసుకెళ్తూ కనిపించాడు. దీనిపై స్థానికులు ప్రశ్నించగా అధికారులే తనకు ఇచ్చారని సమాధానం ఇవ్వడంతో వారంతా అవాక్కయ్యారు. ఈ విషయంపై కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహను వివరణ కోరగా అదేమీలేదని తప్పుకునే ప్రయత్నం చేశారు. మరో అధికారిని వివరణ కోరగా వార్డు కార్యాలయాల్లో డేటా ఎంట్రీకి పంపిస్తున్నామని పొంతన లేని సమాధానం చెప్పడం గమనార్హం.

ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో

విచారణ అధికారి నియామకం

ఎల్బీనగర్: బాలానగర్‌లో హయత్‌నగర్ సర్కిల్ ప్రజాపాలన దరఖాస్తులు రోడ్డుపై పడిన వైనంపై విచారణకు వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ రణజిత్‌ను నియమించినట్లు జోనల్ కమిషనర్ పంకజ తెలిపారు. 24 గంటల్లో రిపోర్టు ఇవ్వాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ ఆదేశాలు జారీ చేశారు. ఈ రిపోర్టు అందిన వెంటనే తగు చర్యల కోసం జీహెచ్ఎంసీ కమిషనర్‌కు నివేదిస్తామని ఆమె వివరించారు.

ఒక్క దరఖాస్తు మిస్ కాలేదు

హయత్‌నగర్ సర్కిల్‌కు చెందిన ప్రజాపాలన దరఖాస్తులు డేటా ఎంట్రీకి కూకట్‌పల్లిలోని ధర్మేందర్ ఏజెన్సీకి 13,760 దరఖాస్తు ఫారాలు అందజేశారు. 6వ తేదీన 5280, 7వ తేదీన 8480 దరఖాస్తులు అందజేశారు. ఏ ఒక్క దరఖాస్తు కూడా పోలేదు.

- ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ

ఏవియేషన్‌లో నాలుగేండ్ల కోర్సు

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రాంగణంలోని జీఎంఆర్ ఎయిర్‌స్పేస్ పార్కులో ఏర్పాటు చేసిన స్కూల్ ఆఫ్ ఏవియేషన్ కేంద్రంలో నాలుగేండ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సును 2024-25 విద్యా సంవత్సరానికి గాను అందుబాటులోకి తీసుకురానున్నట్లు జీఎంఆర్ ఎయిరో టెక్నిక్ ప్రెసిడెంట్ అండ్ అకౌంటబిలిటీ మేనేజర్ అశోక్ గోపీనాథ్ తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 10+2 పాస్ అవ్వాలని, 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీతోపాటు మ్యాథమెటిక్స్ సబ్జెక్టులు కలిగి ఉండాలన్నారు.

శంషాబాద్ మండలం ముచ్చింతల్ గ్రామంలో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న క్రికెటర్ కపిల్‌దేవ్, జూపల్లి జగపతిరావు, తదితరులు

విద్యను మించిన సంపద లేదు

మాజీ క్రికెటర్ కపిల్ దేవ్

శంషాబాద్ రూరల్, జనవరి 9: రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ గ్రామంలో మైహోమ్ గ్రూపు సంస్థ, ఖుషీ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్మించిన ప్రభుత్వ నూతన పాఠశాల భవనాన్ని మంగళవారం మాజీ క్రికెటర్ కపిల్ దేవ్, మైహోమ్ గ్రూపు సంస్థల ఎండీ జూపల్లి జగపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యను మించిన సంపద ప్రపంచంలో మరొక్కటిలేదని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజాత చంద్రయ్య, మాజీ సర్పంచ్ బీర్ల పెంటయ్య, ఉప సర్పంచ్ రాజు పాల్గొన్నారు.

ఓపెన్ హార్ట్ సర్జరీ బాలుడికి మినిమల్లీ ఇన్వాసివ్ చికిత్స

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగిన 16ఏండ్ల బాలుడికి మినిమల్లీ ఇన్వాసివ్ చికిత్సను అపోలో వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. మంగళవారం మీడియా సమావేశంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మనోజ్ అగర్వాల్, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అమోల్‌గుప్తా మాట్లాడుతూ 2007లో పుట్టుకతోనే గుండెలోని రెండు దిగువ గదుల మధ్య పెద్ద రంధ్రం, ఊపిరితిత్తులకు ప్రవహించే మార్గాన్ని అడ్డుకోవడంతో.. టెట్రాలజీ ఆఫ్ ఫాలోట్‌ను సరిచేయడానికి శస్త్రచికిత్స చేశారు. ఎకో, కార్డియాక్ ఎంఆర్ఐలతో చేసిన దానిలో కుడి జఠరిక (ఆర్వీ) పనితీరు సరిగా లేదని వెల్లడైంది. ఊపిరితిత్తుల కవాటం నుంచి ఆర్వీలోకి లీకేజ్‌తో గుండె కుడివైపున వ్యాకోచం కలిగిస్తుంది. 16 ఏండ్ల వయస్సులో రోగం ఎక్కువైందని, ఈనెల 2న అపోలోలో చేరగా ఇన్వాసివ్ ప్రక్రియతో చికిత్సను విజయవంతంగా చేసినట్లు వెల్లడించారు.

లేడీస్ డే

నుమాయిష్‌లో మహిళల సందడి

అబిడ్స్, జనవరి 9 : లేడీస్ డేను పురస్కరించుకొని నుమాయిష్‌లో మహిళలు సందడి చేశారు. జనవరి 1న ప్రారంభమైన 83వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనలో మంగళవారం ప్రత్యేకించి మహిళలకు కేటాయించారు. దీంతో మధ్యాహ్నం నుంచి మహిళలు పెద్ద ఎత్తున నుమాయిష్‌కు తరలివచ్చారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో లేడీస్ డే సందర్భంగా గాంధీ సెంటినరీ హాల్ పక్కనే ఉన్న పెండాల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎగ్జిబిషన్ సొసైటీకి అనుబంధంగా ఉన్న విద్యా సంస్థల విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్యేందర్, కార్యదర్శి బి. హన్మంతరావు, సంయుక్త కార్యదర్శి చంద్రజిత్ సింగ్, కోశాధికారి ఏనుగుల రాజేందరకుమార్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా లేడీస్ డే కమిటీ సలహాదారురాలు అనిత, కన్వీనర్ గాయత్రి, జాయింట్ కన్వీనర్లు మాధవి, అఖిల సంగం పర్యవేక్షించారు. 20 వేల మందికిపైగా మహిళలు సందర్శించినట్లు బుకింగ్ కమిటీ కన్వీనర్ టి. చంద్రశేఖర్ తెలిపారు.

నుమాయిష్‌లో విద్యార్థిని కళా ప్రదర్శన

లిఫ్ట్ ఆపరేటరే హెల్త్ ఇన్‌స్పెక్టర్

నిలోఫర్‌లో అధికారుల నిర్వాకం

అర్హత లేకున్నా అక్రమ పోస్టింగ్.. నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతి

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ): నిలోఫర్ దవాఖానలో కొందరు అధికారుల నిర్వాకం వల్ల లిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేసిన వ్యక్తి ఏకంగా హెల్త్ ఇన్‌స్పెక్టర్ అయ్యారు. అర్హత లేకున్నా, నిబంధనల విరుద్ధంగా వచ్చిన పదోన్నతిపై వివరాల్లోకి వెళితే.. కోటేశ్వర్‌రావు అనే ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి గతంలో ఒక కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేశాడు. కొంత కాలం తరువాత ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నిలోఫర్‌లో లిఫ్ట్ ఆపరేటర్‌గా చేరాడు. కొన్ని రోజుల తరువాత అతన్ని ఓపీ రిజిస్ట్రేషన్ విభాగంలో నియమించారు. పెద్దగా విద్యార్హతలు లేని సదరు వ్యక్తి రోగుల వివరాలను సరిగ్గా నమోదు చేయలేకపోవడంతో అక్కడి నుంచి తప్పించి, మూడు నెలల క్రితం ఏకంగా దవాఖానలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ పోస్టును కట్టబెట్టారు. నిబంధనల ప్రకారం ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని హెల్త్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించకూడదు. తప్పని పరిస్థితుల్లో నియమించాల్సి వస్తే అర్హులైన వారిని ఎంపిక చేయాలి. కానీ లిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేసిన వ్యక్తిని హెల్త్ ఇన్‌స్పెక్టర్ నియమించడంతో విమర్శలు వెల్లువెత్తాయి.

విధుల నుంచి తప్పించాం

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి హెల్త్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు అప్పగించడం కరెక్ట్ కాదు. కోటేశ్వర్‌రావును విధుల నుంచి తప్పించాలని ఆర్ ఎంవోను ఆదేశించాం. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతులతో నిలోఫర్‌లో హెచ్ఐ(హెల్త్ ఇన్‌స్పెక్టర్లు)కొరత ఏర్పడింది. హాస్పిటల్‌లో సామర్థ్యానికి మించి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అత్యవసరమైనప్పుడు మాత్రమే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వినియోగించుకుంటాం. కానీ కీలక బాధ్యతలు అప్పగించం. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవు.

- డాక్టర్ ఉషారాణి, సూపరింటెండెంట్